# జీవనోపాధి

ఈ మధ్యనే ఒక ముద్రణాలయానికి అధిపతి నయ్యాను. కార్యాలయంలో కూర్చుని, అచ్చుపనులు నిర్వహించుకుంటూ ఏవో ప్రూఫులు దిద్దుకుంటున్నాను.

" మ్మే మ్మే మ్మే" అని అరుపు. రెండు స్వరాలతో కూడినది. మేక గొంతుక కాదది, మూగ గొంతుక!

తల యెత్తి చూశాను. ఎదుటనే ఒక మూగవాడు నిలబడి ఉన్నాడు.

"ఏమిటి కావాలి?" అన్నాను.

మూగవాడు జవాబేం చెబుతాడు? జేబులోంచి ఒక చిన్న కాయితం తీసి నాచేతి కందించాడు. ఒక కరపత్రం అది. చదివాను.

"అయ్యా! ఇతని పేరు దీనావనరావు. నిరుపేద. ఇతడు పుట్టిన వెంటనే తల్లిదండ్రులు మరణించారు. ఏదో ఇక్కడా అక్కడా వారాలు చేసుకుని జీవిస్తూ వచ్చాడు. నాల్గవ క్లాసువరకూ చదువుకున్నాడు. కర్మవశాన మనస్తత్వ సంబంధమైన వ్యాధికి గురియై నోరు మూగవోయింది. వీరి తల్లి దండ్రులను, ఇతన్ని, నేను బాగా ఎరిగి ఉన్నాను. ఇతడు చాలా ఉత్తముడు. దైవికంగా జీవనోపాధి లేనివాడయినాడు గనుక, మీరు మీ యథాశక్తి సహాయం చేసి, ఈ దీనుణ్ణి కాపాడి పుణ్యం కట్టుకొనెదరని నమ్ముచున్నాను.

ఇట్లు,

(సం) గోవిందరాజులు నాయుడు,

గవర్నరు

... ప్రదేశ్"

అంత పెద్ద గవర్నరుగారు ఈ మూగవాడిని ఒక అనాథ శరణాలయంలో పారేయరాదూ, ముష్టెత్తుకోమని వీథులంబడి పారేయకపోతే?

నిజమే. కాని, ఇలాంటి అంగవైకల్యం గల దురదృష్ట జీవుల భిక్షువులై దేశంలో అసంఖ్యాకంగా ఉన్నారు. వీరందరినీ ఎంతకని అనాథశరణాలయాల్లో ఉంచుతారు? వాటికయే ఖర్చెంత?

శ్రీరాముడు ఈ దేశాన్ని పరిపాలన చేయలేదూ? మరి అతని పరిపాలనను గురించి 'రామరాజ్యం' అని ప్రత్యేకంగా చెప్పుకుంటూ రెంచేత? అతనికి మల్లే ఈ గవర్నరెందుకు పాలించరాదూ?

బాగానే ఉంది. అప్పుడు మాత్రం భిక్షుకులు లేరూ? అప్పుడు భిక్షుకులే లేకపోతే, రావణుడు బిక్షుకుని రూపంలో సీతాదేవి ఆశ్రమం వాకిట నిలబడ్డ మెందుకూ?

కరపత్రం చదివిన పిమ్మట, జేబులోంచి ఒక అణాతీసి మూగవాని చేతిలో పెట్టబోయేసరికి - 'వద్దు' అన్నట్లు చేయి ఊపాడు.

"ఈ్హఁ ఈ్హఁ" అని కరపత్రాన్ని నా టేబుల్‌పై వుంచి, రెండు గుద్దులు గుద్దాడు. అతని సంజ్ఞ నేను సరిగ్గా అర్థం చేసుకోలేక సతమత మవుతున్నాను. ఇంతలో మూగవాడు, మా ప్రెస్ కార్మికుడు కిట్టయ్యని వేలెట్టి చూపాడు.

నేను కిట్టయ్యని పిలిచి "ఓయ్ చూడు, ఇతనేవో సంజ్ఞలు చేస్తున్నాడు. ఏం కావాలో కనుక్కో" అన్నాను.

"మీరు లేనప్పుడు వీడు రెండుసార్లు వచ్చాడు సార్! మీరొచ్చిన తర్వాత రమ్మన్నాను. వాడు చూపిస్తూన్న కరపత్రాలు ఒక రెండువందలు అచ్చువేయించమని సంజ్ఞలు చేశాడు. వాడు తిరిగీ జవాబంటే ఇవ్వలేదు కాని, మనం మాట్లాడింది బోధపడుతుంది."

'ఓహో సరే' అని ఎదురుగా ఉన్న బల్లమీద "కూర్చో" అన్నాను. చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నాడు. పాపం, వాడి ఉద్దేశం తెలుసుకో గలిగానని కాబోలు ఆ చిరునవ్వు!

రెండువందల కరపత్రాల ముద్రణకూ మూడురూపాయలు పుచ్చుకోవాలి. కాని పేదవాడు; నా శక్త్యానుసారం నేనూ తోడ్పడినట్లుంది గనుక ఒక రూపాయి

మాత్రమే పుచ్చుకుందా మనుకున్నాను.

"ఒక రూపాయితే" అన్నాను.

జేబులోంచి రూపాయి తీసి యిచ్చాడు. కాని, ఈ మాటు ఇంకా సంతోషిస్తా డనుకున్నాను; మూడు రూపాయలకు బదులు ఒక రూపాయే ఇమ్మన్నాను గనుక! కాని, సంతోషంగా మొహం పెట్టలేదు. బహుశః నా సహృదయతను గ్రహించి ఉండడు.

పోనిండి, గుప్తదానం అన్నారు. అల్లాంటివి బాహ్యానికి వెల్లడిచేస్తే దాని ఫలితమే లేదు. కాగా, ఇంతకీ ఏమిటి- కర్ణుడంత దానం చేసేశామా, రంతిదేవుని పాటి దానం చేసేశామా?

"సాయంకాలం రా, ఇచ్చేస్తాను" అన్నాను.

వెళ్ళిపోయి, సాయంత్రం హాజరయ్యాడు. కరపత్రాలన్నింటినీ కట్ట కట్టించి ఇచ్చేశాను. నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

రైల్వేస్టేషన్ దగ్గర, వీథుల వెంబడి తిరిగీ, అందరికీ అవి చూపిస్తూ, పాపం అలాగే పొట్ట నింపుకుంటాడు మరి!

వారం రోజులు పోయేక మూగ దీనావన రావు మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

"ఏమిటి కావాలి?" అన్నాను. మరో రెండువందలు అచ్చువేయించమన్నట్లు రెండువేళ్లు చూపాడు.

"క్రిందటివారమే కదయ్యా, రెండొందలు వేయించావ్, అపుడే అయిపోయేయా?!" అన్నాను.

జేబులోంచి కరపత్రాల కట్ట తీసి చూపిస్తూ, "ఉన్నాయి. కాని, అవి చాలవు" అన్నట్లు సంజ్ఞలు చేశాడు. కొన్ని వందల మంది హస్తాల్లోపడి, అవి నలిగి, శిథిల దశలో ఉన్నట్లు తోచింది. నా మట్టుకి. డబ్బు బాగానే సంపాదించి ఉంటాడు. అంచేత క్రితానికి మల్లే రెండొందల కరపత్రాలనూ ఒక రూపాయికి మాత్రం నేను అచ్చువేయ దలచుకోలేదు. ఇలా వీడికీ కన్సెషన్ రేట్ అలవాటు చేస్తే, ఇహ వారం వారం నెత్తిమీద సవారై పోతాడు. ఎంతకని? ఈ మాటు మూడు రూపాయలూ పూర్తిగా పుచ్చుకుందామనే నా సంకల్పం.

"మూడు రూపాయలుతే" అంటూ మూడువేళ్లు చూపించాను.

వాడు ఒక్క రూపాయే తీశాడు.

"ఈమాటు రూపాయికి వెయ్యను. మూడు రూపాయలు" అంటూ రూపాయి పుచ్చుకోడం మానేశాను.

కార్మికుడు కిట్టయ్యను మళ్ళీ వేలెట్టి చూపాడు. కిట్టయ్య వచ్చి "ఏమంటాడు సార్?" అన్నాడు.

"క్రిందటి సారేదో పేదవాడు కదా అని రూపాయికి వేస్తే, ఈ మాటూ రూపాయికి వెయ్యమంటాడు" అన్నాను.

"లాభం లేదు. వెళ్ళిపో, మూడు రూపాయలు" అన్నాడు కిట్టయ్య.

మూగవాడు మొండిపట్టు విడువకుండా రూపాయే ఇవ్వజూపాడు.

ససేమిరా లాభంలేదు పొమ్మన్నాను. కార్మికుడు కిట్టయ్య కూడా అదే సమాధానం చెప్పాడు.

మూగ దీనావన రావుకి కోపం వచ్చినట్టుంది. పళ్లు కొరుకుతున్నాడు.

కోపంవస్తే రానీండి. ఎవడి కుద్దరింపు? ఏదో పేదవాడు కదా అని ఒకమాటంటే తక్కువధరకి అచ్చువేశాను. కాని, మాటి మాటికీనా?

"ముందు అవతలికి వెళ్ళు!" అన్నాను విసుగ్గా.

వాడింక సహించినట్లు లేదు. "మొన్న రూపాయికి వేసి, ఇవాళప్పుడే మూడు రూపాయాలా? అంతా దగా, దోపిడీ! ప్రపంచమంతా వీటితోనే నిండివుంది!!" అంటూ చకచకా వెళ్ళిపోయాడు.

బాగానే ఉంది. వాడి జీవనోపాధి ఇలా కల్పించాడు లాగుంది భగవంతుడు అనుకున్నాను.

● జ్యోతి మాసపత్రిక ●

*1959*